
ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): బనవాసి జవహార్ నవోదయలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 9వ తరగతి ప్రవేశానికి 1176 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 836 మంది పరీక్ష రాశారు. అలాగే 11వ తరగతికి 1199 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 871 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాలను నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి పరిశీలించారు.

నిధులు లేక.. నీళ్లు రాక


మరమ్మతులకు నోచుకోని దద్దణాల ప్రాజెక్టు గేట్లు

నిధులు లేక చెరువులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. పూడిక పేరుకుపోయి నీరు నిలువ ఉండడం లేదు. దీంతో ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 20కి పైగా చెరువులు ఉన్నాయి. ఏళ్ల తరబడి వీటిని పట్టించుకోకపోవడంతో రైతులకు సాగు నీరందడం లేదు. పూడిక పేరుకుపోవడం, కాలువల్లో ముళ్ల కంపలు పెరగడం, తూములు తుప్పుపట్టి పని చేయకపోవడం వంటి కారణాలతో నీరు పారడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభుత్వమైనా నిధులు విడుదల చేసి చెరువులతోపాటు దద్దణాల ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- మరమ్మతులకు నోచుకోని చెరువులు
- ఒట్టిపోతున్నా పట్టించుకోని పాలకులు
- ఆరేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- పని చేయని దద్దణాల ప్రాజెక్టు ప్రధాన గేట్లు
- 10 అడుగులకు చేరిన పూడిక
- మంత్రి బీసీపైనే రైతుల ఆశలు

బనగానపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చెరువులకు గత వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. దీంతో చెరువులు మరమ్మతులకు నోచుకోలేదు. బనగానపల్లె నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు దద్దణాల. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన గేట్లు, మరమ్మతులకు, పూడికతీతకు, కాలువల అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు విడుదల కాలేదు. దీంతో ఈ ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకుంటోంది. ప్రాజెక్టుతోపాటు చెరువుల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని మైనర్ ఇరిగేషన్ అధికారులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నివేదికలు పంపినా నయాపైసా విడుదల కావలేదు. ఈ ప్రభుత్వమైనా నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.


దద్దణాల ప్రాజెక్టు

15 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని దద్దణాల ప్రధాన గేట్లు

దద్దణాల ప్రాజెక్టుకు సంబంధించి 15 ఏళ్లుగా ఒక ప్రధాన గేటు, పూడిక గేట్లు, గేట్లు పూర్తిగా పని చేయడం లేదు. ప్రధాన గేట్లు, మరమ్మతులకు నోచుకోలేదు. అయితే ఇందులో ఓ గేటుకు గతంలో మరమ్మతులు చేయించి మిగతా వాటిని పట్టించుకోలేదు. బనగానపల్లె మండలంలోని పాతపాడు గ్రామం వద్ద ఈ ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు కింద ప్రత్యక్షంగా 1516 ఎకరాలకు పరోక్షంగా పది వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. 15 గ్రామాలకు తాగు నీటిని అందిస్తున్నారు. గతంలో ప్రాజెక్టులోకి నీరురాక ఒట్టిపోయింది. ప్రాజెక్టు మరో ప్రధాన గేటు ఒకటి, రెండు పూడిక గేట్లు, మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది.

పేరుకుపోయిన పూడిక

ఐదేళ్ల క్రితం ప్రధాన గేట్ల మరమ్మతులకు నిపుణులు ప్రయత్నించగా ఒక గేటు మాత్రమే అందుబాటులోకి వచ్చింది. మరో గేటు మాత్రం నేటికీ పని చేయడం లేదు. అలాగే పూడిక గేట్లు, స్లూయిస్ గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. పంట కాలువలు దెబ్బతిన్నాయి. పంట కాలువలు ముళ్ల కంపలతో నిండిపోయాయి. ప్రాజెక్టుకు సంబంధించిన ప్లాట్‌ఫారం కూడా మరమ్మతులకు నోచుకోలేదు. అధికారికంగా సుమారు 1516 ఎకరాలకు సంబంధించి పంట కాలువలు శిథిలమయ్యాయి.

రూ.38 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

బనగానపల్లె నియోజకవర్గంలోని పలు చెరువులకు రూ. 35.18 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బనగానపల్లె దద్దణాల ప్రాజెక్టుకు రూ.14.12 కోట్లు, కుక్కలగంటి చెరువుకు రూ.2.80 కోట్లు, రాళ్లకొత్తూరు ఊరకుంట చెరువుకు రూ.40 లక్షలు, సంజామల మండలం ముక్కమళ్ల చెరువుకు రూ.7.50 కోట్లు, హోత్రమాన్‌దిన్నె చెరువుకు రూ. 2.40 కోట్లు, రామభద్రుని పల్లె చెరువుకు రూ.20 లక్షలు, కానాల చెరువుకు రూ. 6 కోట్లు, అవుకు మండలం వేముల పాడు చెరువుకు రూ.20లక్షలు, మంగంపేట ఊట చెరువుకు రూ.59 లక్షలు, మంగంపేట తండా ఊట చెరువుకు రూ.69 లక్షలు, మెట్టుపల్లె చెరువుకు కూ.20 లక్షలతో అధికారులు మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క నయాపైసా విడుదల కాలేదు.

చెరువుల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు

బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని చెరువుల అభివృద్ధికి రూ. 38 కోట్లతో గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపాం. అలాగే దద్దణాల ప్రాజెక్టు గేట్లు, పూడిక గేట్లు మరమ్మతుల కోసం రూ.38 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతానికి దద్దణాల ప్రాజెక్టు పంట కాలువలకు వదిలే తూము మరమ్మతులు, పంట కాలువల జంగిల్ క్లియరెన్సుకు రూ.10 లక్షలు నిధులు మంజూరు కావడంతో త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి


దద్దణాల ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపైనే రైతన్నల ఆశలు

దద్దణాల ప్రాజెక్టు ఆధునికీకరణ చేపట్టడానికి, ప్రాజెక్టు గేట్లు, పంట కాలువల మరమ్మతుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. గతంలో దద్దణాల ప్రాజెక్టుకు ఎస్సార్బీసీ కాలువ ద్వారా ఎత్తిపోతల పథకానికి మంత్రి 23 కోట్లకు పైగా నిధులు కేటాయించి పూర్తి చేశారు. ప్రస్తుతం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవ తీసుకొని దద్దణాల ప్రాజెక్టు, నియోజకవర్గంలోని చెరువులకు నిధులు మంజూరు చేయించి తూము గేట్లు, పంట కాలువలు బాగు చేస్తారని రైతులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఈవో, ఆలయ అర్చకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలంలో నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, వేద పండితులు మర్యాద పూర్వకంగా శనివారం కలసి ఆహ్వానించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సన్నద్ధతపై ఈనెల 10నశ్రీశైలంలోని ఆలయ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో మంత్రుల కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న ఏర్పాట్లు, భద్రతాచర్యలపై ఆలయ ఈవో ద్వారా మంత్రి బీసీ అడిగి తెలుసుకున్నారు.

యువతలో బాధ్యత పెరగాలి

- సమాజానికి సాహిత్యం చాలా అవసరం
- ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి
- కర్నూలులో ప్రారంభమైన 'విరసం సాహిత్య పాఠశాల'



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నేటి యువతలో సమాజంపట్ల బాధ్యతలు పెరగాల్సిన అవసరం ఉందని, సాహిత్యం వల్లే సమాజాన్ని అర్థం చేసుకోవడంతోపాటూ సమాజాన్ని అర్థం చేసుకోగలమని దివంగత ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి అన్నారు. విరసం (విప్లవ రచయితల సంఘం) 24వ సాహిత్య పాఠశాల రెండు రోజుల కార్యక్రమాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగర శివారు గుత్తిరోడ్డు, వెంకటాద్రినగర్‌లోగల వెంకటేశ్వర కల్యాణ మండపంలో 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై ఏర్పాటు చేసిన ఈ సాహిత్య పాఠశాల వేదికకు ఇటీవల దివంగతులైన ప్రొఫెసర్ సాయిబాబా ప్రాంగణంగా నామకరణం చేశారు. ఉదయం 11 గంటలకు విరసం నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధుల నడుమ అట్టహాసంగా విరసం పతాకాన్ని ఆవిష్కరించారు. అరుణోదయ కళాకారులు ఆలపించిన పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అరుణ్ ఆహ్వానంపై విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో వసంతకుమారి ప్రసంగించారు. ఆమె ప్రొఫెసర్ సాయిబాబా వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని, నిబద్ధతతో కూడిన ఆయన జీవిత సారాన్ని వివరించారు. ప్రొఫెసర్ సాయిబాబా జీవితంతో, మరణంతోనూ సమాజంలో ఒక ఉత్తేజాన్ని తీసుకొచ్చారన్నారు. ఆయన సహచర్యంలో ఆయనతో కలిసి చేసిన అనేక ప్రజా ఉద్యమాలను, పోరాటాలను ఆమె వివరించారు. ఉద్యమ జీవితంలో రాజకీయాలు, సాహిత్యం వేర్వేరు కాదని, అవి ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయని చెప్పారు. సాయిబాబా ఢిల్లీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఆయన అనేక పోరాటాలను చేశారని చెప్పారు. విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ నేడు రాజ్యం, మతం గట్టి బంధం ఏర్పరచుకున్నాయని, ప్రగతిశీల ఉద్యమకారులు, కవులు, ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండను ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చేయాల్సిన ప్రణాళికలను చర్చించాలని సూచించారు.


విరసం కార్యక్రమాలకు హాజరైన వివిధ ప్రాంతాల ప్రతినిధులు

మిగతా 6వ పేజీలో

ఓ పోలీస్ స్టేషన్ కావాలి

- 1.76 లక్షల జనాభాకు ఒక్కటే స్టేషన్
- ఆ 16 వార్డుల్లో పెరిగిపోతున్న నేర సంస్కృతి
- విస్తరించిన కాలనీలు.. కనిపించని రక్షణ చర్యలు
- ఎప్పటి నుంచి అదనపు పోలీస్ స్టేషన్ కోసం డిమాండ్



కర్నూలు క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని ఆనుకున్న ఆ 16 వార్డుల్లోని పలు కాలనీల్లోని ప్రజలు చాలా కాలంగా ఓ పోలీస్ స్టేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఈ కాలనీలన్నీ పదిహేనేళ్ల కిందటే కర్నూలు మున్సిపాలిటీలో కలిశాయి. అప్పటి నుంచి ఆ కాలనీ శివారు ప్రాంతాల్లో జనాభా విపరీతంగా పెరిగింది. కాలనీలు విస్తరించాయి. జనాభా కూడా మూడు లక్షల పైమాటే. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్‌కు చెందిన 16 వార్డుల్లో 1.76 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇంత మంది జనాభా ఉన్న ఈ కాలనీలకు ఒక్క పోలీస్‌స్టేషన్ మాత్రమే ఉంది. పెరుగుతున్న జనాభా దృష్ట్యా ఇక్కడ మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని చాలా కాలంగా ప్రతిపాదన ఉంది. పలు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పట్టించుకుని వదిలేస్తుండటం, కాలనీల్లో సరైన పోలీసింగ్ లేకపోవడంతో నేర ప్రవృత్తి పెరుగుతోంది.

పాణ్యం నియోజకవర్గంలో కల్లూరు అర్బన్ ప్రాంతానికి చెందిన 16 వార్డులు ఉన్నాయి. వీటిలో మూడు వార్డులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండగా మిగతావన్నీ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోకే వస్తున్నాయి. ఈ 16 వార్డుల్లో 60కి పైగా కాలనీలు ఉన్నాయి. ప్రధానంగా శరీన్‌నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, కల్లూరు తదితర ప్రాంతాల్లో నేర సంస్కృతి వేగంగా విస్తరిస్తోంది. పలు హత్య కేసుల్లో నిందితులు ఈ ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారు. పాఠశాలలు, పార్కులు, పబ్లిక్ స్థలాలు హంద్రీనది వెంట విచ్చలవిడిగా పేకాట, బెట్టింగులు సాగుతుంటాయి. రాత్రయితే చాలు బీరు సీసాలు గళగళలాడుతుంటాయి. ఉదయాన్నే వచ్చే ఉపాధ్యాయులకు ఈ సమస్య తలనొప్పిగా మారింది. ఈ సమస్య ఎక్కువగా షరీన్ నగర్‌లోని పాఠశాలలో కనిపిస్తోంది. హంద్రీనది ఒడ్డు వెంట నిత్యం తాగుబోతులే కనిపిస్తుంటారు. మద్యం సేవించడానికి వెళ్లి ఒకరొకరు కొట్టుకుని ఎంతో మంది హత్యకు కూడా గురయ్యారు. మరోవైపు నగర శివారు కాలనీలు పెరుగుతు న్నాయి. అందమైన కాలనీలు రూపొందుతున్నా కొంత మంది ఆకతాయిలు, రౌడీషీటర్ల వల్ల ఈ ప్రాంతానికి మాస్ ఏరియాగా పేరు పడుతోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మరో వైపు కర్నూలు ఆర్టీసీ బస్టాండు పెద్ద సమస్య. నిత్యం వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ తరచుగా జరుగుతున్న దొంగతనాలతో పోలీసులే బెంబేలెత్తిపోతున్నారు. మరో వైపు బస్టాండు వెనుక ప్రాంతం పాత కల్లూరు ప్రాంతాల్లో ఉండే లాడ్జిల్లో నిత్యం బ్రోతలింగ్, పేకా ట వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. నిత్యం తాగుబోతులతో రద్దీగా ఉంటుంది.

మిగతా 7వ పేజీలో

మేయర్ పీఠంపై

టీడీపీ కన్ను..!?

కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్యకు అవిశ్వాస గండం తప్పదా..? తాజాగా రాజకీయ సమీకరణాలు పరిశీలిస్తే నిజమే అనిపిస్తోంది. మరో ఏడాది పదవీ కాలం ఉన్న మేయర్ పీఠం కోసం టీడీపీ కన్నేసింది. ఎలాగైనా ఆ పీఠంపై బీసీ సామాజికవర్గానికి చెందిన టీడీపీ కార్పొరేటర్‌ను కూర్చొబెట్టేందుకు ఆ పార్టీ నాయకులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ముందుగా పాలకవర్గంలో బలం పెంచుకుంటున్నారు. ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిపి టీడీపీ బలం 22 సభ్యులకు చేరింది. పదవి దక్కాలంటే ఆరుగురు సభ్యుల బలం కావాలి. ఇప్పటికే పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ ముఖ్య నేతలకు టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. తాజాగా రెండు రోజుల క్రితం టీడీపీకి టచ్‌లోకి వచ్చిన వైసీపీ కార్పొరేటర్లలో టీడీపీ కార్పొరేటర్లు ఓ రైస్ మిల్లులో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే హిందూపురం మున్సిపల్ చైర్మన్, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవులను టీడీపీ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో కర్నూలు మేయర్ రామయ్యపై అవిశ్వాసం తప్పదంటూ నగరంలో జోరుగా చర్చ సాగుతోంది.




- ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి 22కు చేరిన బలం
- మరో ఆరుగురు వస్తే కుర్చీ టీడీపీ సొంతం
- టీడీపీ నేతల టచ్‌లో పలువురు వైసీపీ కార్పొరేటర్లు
- మేయర్ రామయ్యకు పదవీ గండం తప్పదా..?

కర్నూలు న్యూసిటీ/కర్నూలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థగా 1994లో ఏర్పడింది. 1995లో జరిగిన తొలి మేయర్ ఎన్నికల్లో నాటి టీడీపీ అభ్యర్థి బంగి అనంతయ్య విజయం సాధించి మేయర్ పీఠంపై కూర్చున్నారు. 2000లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి మేయర్‌గా ఫిరోజ్‌బేగం బాధ్యతలు చేపట్టారు. 2005లో జరిగిన ఎన్నికల్లో కూడా రెండో పర్యాయం కాంగ్రెస్ విజయం సాధించి మేయర్ పదవిని ఎస్.రఘురామిరెడ్డి దక్కించుకున్నారు. ఆ తరువాత పదేళ్లు ఎన్నికలు జరగలేదు. 2021లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. మేయర్‌గా బీవై రామయ్య బాధ్యతలు చేపట్టారు. 52 వార్డులు (డివిజన్లు) కలిగిన కర్నూలు కార్పొరేషన్‌లో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆనాటి అధికార పార్టీ వైసీపీ 43 విజయం సాధిస్తే.. టీడీపీ అభ్యర్థులు ఆరుగురు, ఆ పార్టీ మద్దతుతో ముగ్గురు కలిపి 9 మంది విజయం సాధించారు.

మిగతా 6వ పేజీలో

తుంగభద్ర తీరం సాహిత్యం



జ్ఞాపకాల పురి విప్పిన నెమలీకలు- నెమరు వేతలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): 'తెలుగు సాహిత్యంలో ఉన్నంతమంది గొప్ప కథా రచయితలు ఏ భారతీయ భాషల్లో లేరని, ఆ అదృష్టం తెలుగు వారికే ఉందని' ప్రముఖ రచయిత, పద్మశ్రీ కొలుకలూరి ఇనాక్ అంటారు. అలాంటి ఒక గొప్ప కథా రచయిత జిల్లాకు చెందిన జి. ఉమామహేశ్వర్. ఈ రచయితకు కథా సాహిత్యం అంటే అమితమైన ఇష్టం. ఆ ఇష్టమే తనతో అనేక కథలను చదివించింది. ఆ ఇష్టమే తనను వర్తమాన కథా రచయితల సరసన నిలబెట్టింది.

గత జీవితానుభవాలు స్మృతిపథంలో మెదిలినప్పుడు రచయితలు రాయకుండా ఉండరు. అలా ఉమామహేశ్వర్ స్మృతిపథం నుంచి పుట్టినదే 'నెమలీకలు నెమరువేతలు' కథా సంపుటి. మధురమైన ఆనాటి జ్ఞాపకాల్లోని తన బాల్యాన్ని, బాల్య స్నేహితులను లాక్కెళ్లి, చిన్నతనంలో వాళ్లు చేసిన అల్లరి చేష్టలు, కొంటె పనులు, సరదాలు, సంబరాలను నెమరువేసుకోవడానికి ఉమామహేశ్వర్ చెల్లాచెదురైన తన జ్ఞాపకాలన్నింటినీ తోడుకొని ఒకచోట కుప్పపోస్తే ఈ నెమలీకలు నెమరువేతలు కథా సంపుటిగా పాఠకుల చేతుల్లో వాలింది. ఈ కథా సంపుటి చదివితే అది కురిపించే బాల్యపు జ్ఞాపకాల జడివానలో పాఠకులు తడిసి ముద్ద కావాల్సిందే.

ఉమామహేశ్వర్ తను రాసిన తొలి కథ 'గొర్రె చచ్చింది'. ఇది 1998 జూలై 18న ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించారు. ఆయన రాసిన కథలు తమిళ, కన్నడ భాషల్లోకి అనువాదం అయ్యాయి. 2011లో 'పరాయోళ్ళు', 2018లో 'భరోసా' కథా సంపుటాలు వెలువరించారు. నెమలీకలు నెమరువేతలు ఆయన రాసిన మూడో కథా సంపుటి. నెమలీకలు నెమరువేతలులో మొత్తం 16 కథలు ఉన్నాయి. ఇందులోని ప్రతి కథ మనల్ని వేలుపట్టుకొని మన బాల్యంలోకి లాక్కెళతాయి. 'కడప టు సున్నిపెంట వయా శ్రీశైలం' ఈ కథా సంపుటిలోని మొదటి కథ. '1978 వేసవి మధ్యాహ్నం' ఇది ఈ కథలోని తొలివాక్యం. ఎత్తుగడ శిల్పంతో రచయిత తన కథల కాలాన్ని సూచించారు. రచయిత బాల్యం శ్రీశైలానికి కూతవేటు దూరంలో గల సున్నిపెంటకు చేరుకోవడం, నల్లమల కొండలలో ప్రతిధ్వనించే సుప్రభాత శ్లోకాలు, కాలుష్య ఛాయలు సోకని, నాగరికత ఆనవాళ్లు కనిపించని ఆ ప్రాంతాన్ని వర్ణించిన తీరు వల్ల కథ అద్భుతంగా ఆకట్టుకుంటుంది. ఈ సంపుటిలోని కథల వెనుక ఉన్న జ్ఞాపకాలు ఎంత మధురమైనవో, అంతే వేదనాభరితమైనవి. కొన్ని జ్ఞాపకాలు మనల్ని ముందుకు నడిపిస్తే, మరికొన్ని మనసును బాధిస్తాయి. కొన్ని జ్ఞాపకాలు అప్పుడప్పుడూ నవ్విస్తాయి. మైమరపిస్తాయి. ఈ కథలు కేవలం రచయిత జ్ఞాపకాలు మాత్రమే కాదు, అవి మనవి కూడా అనిపిస్తాయి. ఉమామహేశ్వర్ కథలు మరిచిపోయిన మన బాల్యపు జ్ఞాపకాల్లోనికి వెళ్లడానికి దారి దీపాలై నిలబడతాయి.



- డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు

నిష్ఠూరపు సమయం

సడలిన బంధాలు
అర క్షణం కూడా ఆలోచించలేని
అపార్థాల నడుమ
మళ్లీ మళ్లీ ముడిపడలేక
తడిసిన ఆకాశపు అంచుల్లా
విలపించబోయే ముందు
ఒదిగి వున్న సంద్రంలా
బడబాగ్నిని గుండెల్లో దాచుకున్నాయి.

ఆత్మాభిమానపు పెనుగులాటలో
భుజానికి తగిలించుకున్న ప్రశ్నలు
మరింత బరువెక్కితే
యాంత్రికత్వపు ముసుగులో
వర్తమానం
సమాధానానికై వెతికింది
ముళ్లకంప మీద
విసిరేయబడ్డ మనసు
బయట పడేందుకు
భ్రమను సాయం అడిగింది.

ముడులను మళ్లీ మళ్లీ సరిచేస్తున్న
మమకారం చిరాకుకు
చిరునామా అయితే
ఆత్మాభిమానం అనవసరపు
పెనుగులాటలో
అంతర్యుద్ధం చేస్తోంది
అభిమాన ఆత్మాభిమానాల మధ్య
జరుగుతున్న సంఘర్షణ
హోరెత్తిన సంద్రంలా అగుపించినా
కాళ్ల కింద ఇసుకకు మల్లే కృంగదీస్తోంది
ఈ నిష్ఠూరపు సమయం కూడా
జీవన దశే అని సాగిపోవాలని
తెలుసుకునేందుకు అనుభవమే
చాలట్లేదు.



- కల్యాణదుర్గం స్వర్ణలత,
కర్నూలు
98486 26114

నగరంలో నేడు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉదయం 10 గంటలకు నగరంలో గుత్తిరోడ్డులోని వెంకటాద్రినగర్‌లోగల వెంకటేశ్వర కల్యాణ మంటపంలో విరసం ఆధ్వర్యంలో రెండోరోజు కార్యక్రమాలు మొదలవుతాయి. విరసం నాయకులు అరసవిల్లి కృష్ణ, వరలక్ష్మి, పాణి, సాగర్‌ల ప్రసంగాలు, సాయంత్రం 4:30 గంటలకు బహిరంగ సభలో కె.నాగేశ్వరాచారి, జి.కల్యాణరావు, ప్రొఫెసర్ హరగోపాల్, బొజ్జా దశరథరామిరెడ్డి వంటి ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయి.

- మధ్యాహ్నం 3 గంటలకు గోదా గోకులం క్షేత్రంలో అష్టావధానం సభ ఉంటుంది. అవధాని బులుసు అపర్ణ అవధానం చేస్తారు. ముఖ్య అతిథిగా క్లస్టర్ యూనివర్శిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, విశిష్ట అతిథులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి రాంశంకర్ నాయక్, మాంటిస్సోరి, ఇండస్ పాఠశాలల అధినేత కేఎస్‌వీ రాజశేఖర్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.
- సాయంత్రం 6:30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజుల ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు పత్తి ఓబులయ్య, బీఎస్ రావు తెలిపారు. ప్రముఖ గాయకులతో అలనాటి ఘంటసాల పాటలతో సంగీత విభావరి నిర్వహిస్తున్నారు..




కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

అటవీ భూముల సర్వే

అన్యాక్రాంతం కాకుండా చర్యలు



తిమ్మాపురం పొలాల్లోని అటవీ భూముల్లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు

మహానంది, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహానంది-బండిఆత్మకూరు మండలాల్లోని నల్లమల అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా అటవీశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శనివారం నల్లమల్ల సరిహద్దులో సర్వే ప్రారంభించారు. మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని 166,167,168,170 సర్వే నంబర్‌లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల తహసీల్దార్ రమాదేవి, నంద్యాల డివిజన్ అటవీ రేంజ్ ఆఫీసర్ ధినేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో నంద్యాల మండల సర్వేయర్లు శివప్రసాద్, నాగరాజుతోపాటు విలేజ్ సర్వేయర్లు క్రిష్ణ, హుసేనయ్య, సద్దాం ఉసేన్, షఫీలు సర్వే నిర్వహించి ఆయా సర్వే నంబర్లలోని అటవీ సరిహద్దులను గుర్తించారు. మిగతా అటవీ పరిసరాల్లో కూడా పది రోజుల పాటు సర్వే నిర్వహించి అటవీ భూమి ఆక్రమించిన ప్రదేశాలను గుర్తించి స్వాధీనం చేసుకుంటామని అటవీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ డీఆర్వో హైమావతి, ఎఫ్ఎస్ఓ రామకృష్ణ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రాణా ప్రతాప్, పరమేశ్వరి పాల్గొన్నారు.

తెలుగుభాషపై పట్టు.. పతకాలు కొట్టు

సాహిత్యం, కథలు, పుస్తక సమీక్ష పోటీల్లో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థులు



రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన గ్రామీణ విద్యార్థులు

చాగలమర్రి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుపై పట్టు సాధించి ఎక్కడ బాష పోటీలు జరిగిన పాల్గొని బహుమతులు సాధిస్తున్నారు చాగలమర్రి మండలం పెద్దబోధనం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. తెలుగు విభాగంలో సాహిత్యం, కథలు, పుస్తక సమీక్ష పోటీల్లో పాల్గొని బహుమతులు సాధిస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి డి.యశ్వంత్ 2024 సెప్టెంబరులో ఉరిమల్ల ఫౌండేషన్ నిర్వహించిన జాతీయస్థాయి పుస్తక సమీక్షలో 300 మంది పాల్గొంటే వారిలో ప్రథమంగా నిలిచారు. జాతీయ స్థాయిలో జ్ఞాపిక, పతకాన్ని దక్కించుకున్నారు. పుస్తక సమీక్షలో విజేతగా నిలవడంతో తెలుగు బుక్‌ఆఫ్‌రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. యశ్వంత్ రాసిన ఐదు నీతికథలు కూడా నీతి పరిమల పుష్పాలు అనే పుస్తకంలో ప్రచురితమయ్యాయి. మాచిరాజు బాలసాహితి పీఠం, హైదరాబాదులో నిర్వహించిన కథల పోటీల్లోను ప్రథమంగా నిలిచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. అలాగే పదోతరగతి చదువుతున్న నాగపుష్ప అనే విద్యార్థి కథల పోటీల్లో సత్తా చాటుతూ విజేతగా నిలిచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విద్యార్థిని ఆసక్తిని గమనించిన తెలుగు ఉపాధ్యాయురాలు నాగేశ్వరమ్మ ఎంతగానో ప్రోత్సహించారు. నాగపుష్ప తెలుగుపై మక్కువతో సాహిత్యాభిలాష పెంపొందించుకున్నారు. చిన్న చిన్న కథలు రాస్తూ పోటీలు ఎక్కడ జరిగిన పాల్గొని ప్రతిభ చాటుతున్నారు. 2024 సెప్టెంబరులో హైదరాబాదు మాచిరాజు బాలసాహితీ పీఠం నిర్వహించిన కథల పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలిచారు. ఉమ్మడి తెలుగురాష్ట్రాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో 232 మంది విద్యార్థులు పాల్గొనగా 25 మందిని విజేతలుగా ప్రకటించారు. అందులో నాగపుష్ప ఒకరుగా నిలిచారు. జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులు యశ్వంత్, నాగపుష్పలను పాఠశాల హెచ్ఎం కాత్యాయని, ఉపాధ్యాయులు అభినందించి మెమోంటోలు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. తెలుగు భాషలో పట్టు సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయురాలు నాగేశ్వరమ్మకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు తమ నైపుణ్యంతో మరిన్ని పథకాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకొని రావాలని హెచ్ఎం కోరారు.

మేయర్ పీఠంపై టీడీపీ కన్ను..!?

(5వ పేజీ తరువాయి)

వైసీపీ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో 19వ వార్డు కార్పొరేటర్‌గా విజయం సాధించిన బీవై రామయ్య మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ మేయర్లుగా ఎస్.రేణుక, ఎస్.అరుణ బాధ్యతలు చేపట్టారు. 52 వార్డుల్లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 33, పాణ్యం నియోజకవర్గం పరిధిలో 16, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో మూడు డివిజన్లు ఉన్నాయి. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించడం, నగర అభివృద్ధి కోసం వైసీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా టీడీపీ గొడుగు నీడలో చేరడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం బలహీనమవుతూ వస్తోంది.

22 సంఖ్యకు చేరిన టీడీపీ బలం

కార్పొరేషన్ పాలకవర్గంలో 52 మంది కార్పొరేటర్లు ఉన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎమ్మెల్యే మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదు చేయించుకున్నారు. వీరితో కలిపితే కౌన్సిల్‌లో ఓటు హక్కు కలిగిన సభ్యుల సంఖ్య 55కు చేరింది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు దక్కించుకోవాలంటే 28 మంది సభ్యుల బలం ఉండాలి. వాస్తవంగా టీడీపీకి 9 మంది కార్పొరేటర్లే ఉన్నారు. ఎన్నికల ముందు, ఆ తరువాత మరో 10 మది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ గూటికి చేరడంతో 19 మందికి చేరింది. వీరితో పాటు ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలతో కలిపితే టీడీపీ బలం 22కు చేరింది. 43 కార్పొరేటర్లు కలిగిన వైసీపీ ప్రస్తుతం బలం 33కు పడిపోయింది. టీడీపీ బలం పెరగడంతో వైసీపీలో అంతర్మథనం మొదలైంది.

అవిశ్వాసానికి రంగం సిద్ధమైందా..?

2021 మార్చి 18న మేయర్ బీవై రామయ్య ప్రమాణ స్వీకారం చేశారు. 2026 మార్చి 17 వరకు అంటే ఏడాది పదవీ కాలం ఉంది. ఎలాగైనా సరే రామయ్యను పదవి నుంచి దింపేయాలని టీడీపీ ముఖ్య నాయకులు తెర వెనుక రాజకీయ వ్యూహాలకు పదును పెట్టినట్లు సమాచారం. అధికారంలో ఉండగా మేయర్ రామయ్య తమను కనీసం కార్పొరేటర్లుగా గుర్తించి గౌరవం ఇవ్వలేదని, ఆయన ఆ పదవిలో ఉంటే చూడలేకపోతున్నామని, అవిశ్వాసం పెడితే బేషరతుగా మద్దతు ఇస్తామని వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ నేతలకు చెబుతున్నట్లు తెలుస్తోంది. అయితే టీడీపీ నాయకులు మాత్రం రాజకీయంగా ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు ఓ రైస్ మిల్లు కేంద్రంగా అత్యవసర భేటీ కావడంతోపాటు మేయర్‌పై అవిశ్వాసంపై చర్చించినట్లు తెలుస్తోంది. దీంతో రామయ్యను పదవి నుంచి దింపేందుకు రంగం సిద్ధమైందని చర్చ జరుగుతోంది. అయితే అవిశ్వాసానికి ముందే బీవై రామయ్య తన పదవికి రాజీనామా చేస్తారని కూడా పలువురు చర్చించుకోవడం గమనార్హం.

అవిశ్వాసం పెడితే..

మేయర్ బీవై రామయ్యకు పదవి గండం తప్పదా..? నగరంలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. 9 మంది సభ్యుల బలం కలిగిన టీడీపీ.. ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిపి 22 సభ్యులకు చేరింది. అవిశ్వాసం ద్వారా మేయర్‌ను పదవి నుంచి దింపేయాలి అంటే.. అవిశ్వాసం పెట్టిన రోజు కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యుల్లో సగం కంటే ఒకరు ఎక్కువ మెజార్టీ సాధించాలి. అప్పుడు మేయర్ అవిశ్వాసం నెగ్గి పదవి కాపాడుకున్నట్లే. సగం కంటే ఒకరు తక్కువైతే పదవి కౌన్సిల్ విశ్వాసం కోల్పోయినట్లే. మేయర్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత జరిగే మేయర్ ఎన్నికల్లో కొత్తగా మేయర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సభ్యుల సంఖ్య ప్రకారం మేయర్ రామయ్య పదవి కాపాడుకోవాలంటే 28 మంది సభ్యుల బలం కూడగట్టుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వైసీపీకి 33 మంది సభ్యులు ఉన్నా.. వారిలో ఆరేడుగురు టీడీపీ ముఖ్య నాయకులకు టచ్‌లో వెళ్లినట్లు తెలుస్తోంది. అవిశ్వాసం పెడితే వారంతా టీడీపీకి మద్దతు ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు సమాచారం. అదే జరిగితే వైసీపీ బలం 25-26కు పడిపోతుంది. మేయర్ అవిశ్వాసంలో ఓడిపోక తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

యువతలో బాధ్యత పెరగాలి

(5వ పేజీ తరువాయి)

ఫాసిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం

- అల్లం రాజయ్య



దేశంలో ఫాసిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిందేనని ప్రముఖ రచయిత అల్లం రాజయ్య అన్నారు. విరసం రెండో సెషన్‌లో శివరాత్రి సుధాకర్ అధ్యక్షతన 'మేథో సృజన రంగాలపై ఫాసిస్టుల దాడి - కార్పొరేట్ ప్రయోజనాలు' అనే అంశంపై అల్లం రాజయ్య ప్రసంగిస్తూ రాజ్యం కోసం చేసే యుద్ధం నిలబడుతుందా లేదా ప్రజాసంఘాలు చెప్పాల్సిందేనని అన్నారు. అన్నిరకాల భావజాలాలు తమ మందకొడితనాన్ని వదులుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ క్రమంలో చరిత్రను అధ్యయనం చేసి ప్రజా పోరాటాలకు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.

సంఘ్ పరివార్ ఏడు ఎత్తుగడలు

-కెంగార మోహన్



మాట్లాడుతున్న కెంగార మోహన్

సంఘ్ పరివార్ ఏడు రకాల ఎత్తుడగడ్ని అవలంబిస్తోందని, దేశ చరిత్రను ఘనంగా చెప్పడం, హిందువులను వేరుగా గుర్తించి, వారిని ఒక గొడుగు కిందకి చేర్చడం, దేశం ఎదుర్కొంటున్న ఉపద్రవాలకు ముస్లిం, క్రిస్టియన్, కమ్యూనిస్టులను బాధ్యుల్ని చేయడం, హిందుత్వ విమర్శకులను దేశద్రోహులుగా ముద్రవేయడం, విద్య కాషాయీకరణ, మతాల ఆధారంగా ఆందోళనలు వంటి చేస్తోందని ఆరోపించారు. గతంలో రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు వచ్చాయని, 2014 తర్వాత భావజాల రంగంలో సంక్షోభాలు తీవ్రమయ్యాయని అన్నారు. సభలో సైబాబా మాట్లాడుతూ దేశంలో ముస్లింలపై జరుగుతున్న దారుణ మారణకాండలపై కవులు గళమెత్తాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా అరుణోదయం కళాకారులు రూపొందించిన ఆడియో సీడీని అరుణోదయ అధ్యక్షురాలు విమల, వసంతకుమారి, అరసవిల్లి కృష్ణ, అరుణోదయ కళాకారుల మధ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీక్షణం సంపాదకుడు ఎన్ వేణుగోపాల్, విరసం రాష్ట్ర కార్యదర్శి రివేరా, విరసం నాయకులు పాణి, అరుణ్, వరలక్ష్మి, శశికళ, నాగేశ్వరాచారి తదితరులు ప్రసంగించారు.

సాధనతోనే ఉజ్వల భవిష్యత్తు

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



టెన్నిస్ ఆడుతున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు సాధన చేసి ఉజ్వల భవిష్యత్తును పెంపొందించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శనివారం స్థానిక కర్నూలు క్లబ్ టెన్నిస్ గ్రౌండులో ఏర్పాటు చేసిన 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ అవకాశాలు ఉండే క్రీడలను ఎంచుకోవాలని అన్నారు. తద్వారా ఆరోగ్యం మానసిక వికాసం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌వేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు, జిల్లా సంఘం కార్యదర్శి నవీన్ శావల్, పీఈటీల సంఘం ప్రతినిధి కొండేపి చిన్న సుంకన్న, సుప్రియ, గీత సంఘం ప్రతినిధులు రేవంత్, సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు గీత, సుప్రియ, రంగస్వామి పాల్గొన్నారు.

గుర్తించదగ్గ స్థాయిలో మహిళలు

సత్యవాణి



మాట్లాడుతున్న సత్యవాణి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో గుర్తించదగ్గ స్థాయికి మహిళలు ఎదుగుతున్నారని జి.భారతీయం సత్యవాణి అన్నారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గ సమీపాన గల వికాస భారతి, ధార్మిక సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సురభీ గోశాల భారతీయ స్ఫూర్తి కేంద్రంలోనారీశక్తి చైతన్య సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి వికాస భారతి నిర్వాహకులు నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా భారతీయం సత్యవాణితో పాటు పుల్లారెడ్డి ఇంజ నీరింగ్ కళాశాల డీన్ డా.కే.దేవకి, సమన్వయ కారిణి స్వప్న, బీవీ నాగేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో గుర్తించదగ్గ స్థాయిలో ఎదిగారన్నారు.

క్రమబద్ధీకరణకు పచ్చ జెండా


జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య



కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 2019 అక్టోబరు 15 నాటికి ఆక్రమణలో ఉన్న నివాస గృహాలను రెగ్యులరైజ్ చేయనుందని చెప్పారు. ఈ మేరకు జిల్లాలోని అర్హులైన వారు డిసెంబరు 31 లోపు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పంట ఉత్పత్తుల పండగ

మార్కెట్‌లో భారీగా తరలి వచ్చిన కందులు, వాము, మిర్చి



మిర్చి బస్తాలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో పండగా వాతావరణం కనిపిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులతో కళకళలాడుతోంది. జిల్లాలోని పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన రైతులతోపాటు అక్కడ పని చేస్తున్న కూలీలు, హమీలతో మార్కెట్ అంతా సందడి వాతావరణం నెలకొంది. వరుసగా కుప్పలుగా పోసిన వాము, కందులు కంటి నిండా కనిపిస్తున్నాయి. ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శమనిస్తున్నాయి. రైతులు తమ పంట ఉత్పత్తుల వద్దే కూర్చొని విక్రయాల కోసం ఎదురు చూస్తున్నారు. మంచి ధర అందితే తమ కష్టం తీరుతుందన్న ఆశాభావంతో ఉన్నారు. ఈ తరుణంలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల చేతిలో రైతులు నష్టపోకుండా మార్కెట్ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



కుప్పలుగా పోసిన వాము





కందులు

హోలీక్రాస్ సెంటనరీ చర్చి ప్రారంభం



ప్రారంభోత్సవం అనంతరం హోలీక్రాస్ చర్చి ఎదుట క్రైస్తవులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని ఆర్ఎస్‌రోడ్‌లో హోలీక్రాస్ సెంటనరీ చర్చి శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ జార్జ్ కార్నేలియస్, తెలుగు డయాసస్‌లో ఉన్న బిషప్‌లు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి చర్చిని ప్రారంభించారు. అనంతరం వారు దైవ సందేశాన్ని ఇచ్చారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో, సమాజంలో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ద్వేష, ఈర్ష్య, అసూయలు వదిలి, ప్రేమ, క్షమాపణ, దైవ చింతనతో మెలగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర న్యాయశాఖమంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొని మాట్లాడుతూ హోలీక్రాస్ చర్చి విశ్వాసానికి ప్రతిక అన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ పద్మారావు, హోలీక్రాస్ కేథడ్రిల్ గురువులు పాస్టరేట్, కమిటి సెక్రటరీ ప్రభుదాసు, ట్రెజరర్ స్టీఫెన్, విలియం ఫిలిప్, క్రైస్తవులు పాల్గొన్నారు.




ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి ఫరూక్... చర్చిలో క్రైస్తవులు

ఓ పోలీస్ స్టేషన్ కావాలి..

(5వ పేజీ తరువాయి)

కల్లూరు అర్బన్‌లోని 16 వార్డుల్లో 3 వార్డులకు చెందిన గణేష్ నగర్, అరోరా నగర్, నంద్యాల చెక్‌పోస్టు, మారుతి మెగాసిటీ, చంద్రశేఖర్ నగర్, టెలికాంనగర్ ఇలా కొన్ని కాలనీలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోకి వస్తాయి. అలాగే కర్నూలు నియోజకవర్గం చెందిన ప్రధాన వార్డుల్లో కొన్ని ఈ స్టేషన్ పరిధిలోకే వస్తాయి. మరో వైపు కలెక్టరేట్, కలెక్టరేట్‌లో జరిగే ధర్నాలు, కలెక్టర్ భద్రత అవసరాల కోసం ఎక్కువ భాగం పోలీసింగ్ ఇక్కడే ఉంటుంది. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రి కూడా ఉంది. దీంతో శివారు కాలనీలపై పోలీసులు దృష్టి సారించలేకపోతున్నారు. మరో వైపు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉండాల్సిన సిబ్బంది కంటే తక్కువ ఉండటం.. సుమారు 50 కాలనీలు ఈ స్టేషన్ పరిధిలోకి రావడం ఆటోనగర్, బస్టాండు ప్రాంతాల్లోనే నిఘా పెట్టడంతో శివారు కాలనీల్లో పోలీసులు శ్రద్ధ చూపలేకపోతున్నారు. దీంతో మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే బావుంటుందని కొద్ది కాలంగా ఇక్కడ కాలనీవాసుల ప్రధాన డిమాండ్ ఉంది. ఇటీవల ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరమే అండగా.. సమస్య పరిష్కారమే అజెండా కార్యక్రమానికి వచ్చిన వినతుల్లో తాగుబోతులు, ఆకతాయిల సమస్యలపైనే ఆ కాలనీవాసుల నుంచి వినతులు వచ్చాయి.

గతం నుంచే డిమాండ్

ఈ అర్బన్ వార్డులో మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గతంలోనే డిమాండ్ ఉంది. గతంలో పని చేసిన పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఈ కాలనీల ప్రజలు, ప్రజాప్రతినిధులు పలుసార్లు వినతులు ఇచ్చారు. 2019 సంవత్సరంలో అప్పుడు పని చేసిన ఎస్పీ ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలను గుర్తించి ఓ పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడ ఓ ఏఎస్ఐ, కానిస్టేబుల్ ఉండేలా ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఈ అవుట్‌పోస్టు నామమాత్రంగానే మిగిలిపోయింది. అంతకుముందు పని చేసిన ఎస్పీలు కొన్ని పోలిస్ కమాండ్ కంట్రోల్ బాక్సులు ఏర్పాటు చేసి అక్కడకు కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసేవారు. చైన్ స్నాచింగ్ జరిగిన వెంటనే అక్కడి కానిస్టేబుల్ అప్రమత్తం అయ్యేవాడు. ప్రస్తుతం ఆ కమాండ్ కంట్రోల్ కేంద్రాలు బూత్‌బంగ్లాగా మారాయి. కొన్ని కాలనీలు పోలీస్ స్టేషన్‌కు చాలా దూరంగా ఉండటంతో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరిగినప్పుడు పోలీసులు వెంటనే అప్రమత్తం కాలేకపోతున్నారు. నేరస్థులు ఎటు నుంచి తప్పించుకునే ప్రధాన రహదారులన్నీ కలిసి ఉండటంతో ఈ సమస్య మరింత వేధిస్తోంది.

లక్ష మంది జనాభాకు 144 మంది పోలీసులు ఉండాలి

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో లక్ష మంది జనాభాకు 144 మంది పోలీసులు ఉండాలి. ఈ లెక్కనే త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు మూడు లక్షలు పైగానే జనాభా ఉంది. ఫోర్త్ టౌన్ పరిధిలో సుమారు 45 మంది మాత్రమే. త్రీటౌన్ పరిధిలో 40 మంది పోలీసులు మాత్రమే శాంతి భద్రతల నిర్వహణకు ఉన్నారు. మూడు లక్షల మంది జనాభాకు 420 మంది పోలీసులు ఉండాలి. ఈ రెండు పోలీస్ స్టేషన్లకు కలిసి అటూ ఇటూగా వంద లోపే శాంతిభద్రతల కోసం వంద మంది పోలీసులు మాత్రమే ఉన్నారు. ఇంకా 300 మంది పోలీసుల కొరత ఉంది.

ఏం చేయాలంటే..

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వార్డులను, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వార్డులకు ప్రత్యేకంగా మరో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి ఈ నాలుగుతో పాటు కొత్తగా ఏర్పాటు చేసే పోలీస్‌స్టేషన్‌ను పాణ్యం నియోజకవర్గ పరిధిలో ఉండేలా చేస్తే ఒక విజిబుల్ పోలీసింగ్ ఉంటే నేరాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. అలా కాకపోయినా గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఎస్ఐ, ఎస్‌హెచ్‌వోగా ఉండే ఓ పోలీస్ స్టేషన్, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఎస్ఐ, ఎస్‌హెచ్‌వోగా ఉండే చిన్న పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి పోలీసింగ్ పెంచితే నేర సంస్కృతి తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఓ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి : గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్యే, పాణ్యం

కల్లూరు అర్బన్ వార్డులకు చాలా ప్రాధాన్యత ఉంది. అత్యధిక జనాభా ఇక్కడే ఉంది. ప్రత్యేకంగా ఓ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. ఇటీవల డీజీపీగా పని చేసిన ద్వారక తిరుమల్‌రావుకు కూడా ఈ పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై వినతి పత్రం అందించాం. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

కోవెలకుంట్లలో ఘరానా మోసం

- దుబాయ్ నోట్లు ఇస్తామని మాయమాటలు
- నమ్మి చేరో రూ.5 లక్షలు ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు
- చెత్తకాగితాల మూట ఇచ్చి ఉడాయింపు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


బాధితులు శ్రీనివాసులు, మహ్మద్ బాషా

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్లలో ఘరానా మోసం చోటు చేసుకున్నది. రూ. పది లక్షల డబ్బులు ఇస్తే రూ.30లక్షలు విలువ చేసే దుబాయి కరెన్సీ ఇస్తామని మాయమాటలు చెప్పారు. ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.10 లక్షలు తీసుకొని పైన, కింద దుబాయ్ కరెన్సీ నోట్లు పెట్టి మధ్యలో చెత్తకాగితాలతో నిండిన మూట ఇచ్చి సదరు వ్యక్తి ఉడాయించాడు. బాధితులు మూట విప్పి చెత్తకాగితాలను చూసి మోసపోయామంటూ శనివారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. బాధితులు సయ్యద్ మహబూబ్‌బాషా, డి.శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. నంద్యాల పట్టణంలోని రామాలయం వద్ద ఉన్న జ్యూస్ బండి వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి జ్యూస్ తాగి దుబాయ్ నోటు ఇచ్చాడు. ఈ నోటు చెల్లదు మామూలు నోటు ఇవ్వాలని జ్యూస్‌బండి యజమాని అడిగాడు. దీంతో తాను దుబాయ్‌లో పనిచేస్తానని, అక్కడి డబ్బులు ఇవి అని చెప్పాడు. పక్కనే ఉన్న టెంకాయలు అమ్ముకునే సయ్యద్ మహ్మద్‌బాషాకు ఆ నోటును చూపించారు. మహ్మద్‌బాషా ఆ నోటును నెట్‌లో చెక్ చేయగా అది ఒరిజినల్‌గా తేలింది. దీంతో అతడితో మాటలు కలిపి ఈ నోట్లు తన వద్ద చాలా ఉన్నాయి, మీకు కావాలంటే ఇస్తామని, రేపు రండని సదరు వ్యక్తి సయ్యద్ బాషాను నమ్మించాడు. దీంతో సయ్యద్ అతడి స్నేహితుడు శ్రీనివాసులును తీసుకొని మరుటిరోజు శుక్రవారం ఆళ్లగడ్డకు వెళ్లాడు. సదరు వ్యక్తి నెంబరుకు ఫోను చేయగా బస్టాండు వద్దనే ఉండండి వస్తామని చెప్పి కొన్ని గంటలు కాలయాపన చేయించాడు. తీరా సాయంత్రం ఓ మహిళ మహబూబ్‌బాషా నెంబరుకు ఫోన్ చేసి రూ.10 లక్షలు నోట్లు ఇస్తే రూ.30 లక్షలు విలువ చేసే దుబాయి నోట్లు ఇస్తామని నమ్మించింది. దీంతో శుక్రవారం రాత్రి నంద్యాలకు వెళ్లి శనివారం ఉదయం మహబూబ్‌బాషా రూ.5 లక్షలు, డి.శ్రీనివాసులు రూ.5 లక్షలు తీసుకొని వచ్చి మళ్లీ ఫోన్ చేశారు. సదరు వ్యక్తి తాము ఆళ్లగడ్డలో లేమని కోవెలకుంట్లలో ఉన్నామని బస్టాండు సమీపంలోని షాపు వద్దకు రావాలని తెలిపారు. మహబూబ్‌బాషా, శ్రీనివాసులు ఇద్దరూ రూ.10 లక్షలు తీసుకుని కోవెలకుంట్లకు వచ్చారు. సదరు వ్యక్తి దుబాయి నోట్లు పైన రెండు కింద రెండు పెట్టి మధ్యన చెత్తకాగితాలు పెట్టిన కట్టలను మూటలో పెట్టుకొని బైక్‌పై వచ్చి వారికి మూట ఇచ్చి వారి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు తీసుకుని ఉడయించాడు. సదరు వ్యక్తి వెళ్లిన తరువాత వీరిద్దరూ కొంత దూరం వెళ్లి ఆ మూట విప్పి చూడగా రెండు మూడు దుబాయినోట్లు తప్ప అంతా చెత్తకాగితాలు ఉండడంతో మోసపోయామని లబోదిబోమంటూ కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న చెన్నప్ప అరెస్టు

- వాహనంలో తరలిస్తుండగా నిందితుడి హల్‌చల్
- స్టీరింగ్ తిప్పి వెహికల్ బోల్తా కొట్టించే యత్నం
- హత్యాయత్నం కింద మరో కేసు నమోదు


నిందితుడు చెన్నప్పను చూపుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న వంకదారి చిన్న చెన్నప్పను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ రమేష్‌బాబు నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. స్థలం పంచాయితీ చేస్తానంటూ కొలిమిగుండ్లకు చెందిన అన్వర్ బాషా దగ్గర చిన్న చెన్నప్ప రూ.2లక్షలు తీసుకున్నాడు. పంచాయితీ తీర్చకపోగా మరో రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేదంటే ఎస్సీ ఎస్టీ కేసు పెడతానని, చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు గత నెల 21న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిన్న చెన్నప్పపై కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే మూడు కేసులు ఉన్నాయి. కడప జిల్లా మరో కేసు ఉంది. చిన్న చెన్నప్ప పలువురు వ్యక్తులపై 20 ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాడు. ఇందులో 18 కేసులు పాల్స్ కేసులుగా తేలాయి. ఇలా కేసులు పెట్టి సామాన్య ప్రజలతో పాటు, ప్రభుత్వ అధికారులను బెదిరించేవాడు.


దెబ్బతిన్న పోలీసు వాహనం

పోలీసు వాహనంలో హల్‌చల్

పోలీసులు చిన్న చెన్నప్పను అరెస్టు చేసి తీసుక వెళుతున్న సమయంలో నిందితుడు హల్‌చల్ చేశాడు. పోలీసులను విడిపించుకొని స్టీరింగ్ పక్కకు తిప్పి బోల్తా కొట్టించే ప్రయత్నం చేశాడు. నిందితుడు బలవంతంగా స్టీరింగ్ తిప్పడంతో వాహనం ఒక్కసారిగా పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో నిందితుడితోపాటు, నలుగురు పోలీసులు గాయాలయ్యాయి. హుసేని అనే కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో వైపు పోలీసు వెహికల్‌కు భారీగా డ్యామేజ్ అయింది. దీంతో చిన్న చెన్నప్పపై మరో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

తుగ్గలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నీటిని నింపుకునేందుకు పోయి ప్రమాదవశాత్తు కాలుజారి మధులక్ష్మి (42) నీటి కుంటలో పడి మృతి చెందారు. రాంపల్లెకు చెందిన చాకలి రంగన్న భార్య శనివారం వ్యవసాయ పనులకు వెళ్లి భోజనం చేయడం కోసం నీటిని తీసుకువచ్చేందుకు పొలం పక్కనే ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లారు. బిందెతో నీటిని తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలోకి పడిపోయింది. కేకలు వేయడంతో పొలంలో ఉన్న హనుమక్క అనే మహిళ చీర కొంగు వేసి లాగేందుకు యత్నించినా పట్టుకోలేక లోపలికి వెళ్లిపోయి ఊపిరాడక మృతి చెందారు. గ్రామస్థులకు తెలపడంతో మృతదేహాన్ని నుంచిబయటకు తీశారు. మధులక్ష్మి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. మధులక్ష్మికి కొడుకు, కుమార్తె ఉన్నారు.

కారు బోల్తా పడి మహిళ..


దెబ్బతిన్న కారు, ఇన్‌సెట్ మహేశ్వరి(ఫైల్)

వెల్దుర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో కారు అదుపుతప్పి బోల్తాపడడంతో ఓ మహిళ మృతి చెందారు. వివరాలివీ.. సత్యసాయి జిల్లా గుమ్మలకుంటకు మహేశ్వరి, ఏడాది న్నర కుమారుడు వియాన్స్‌రెడ్డి, అలాగే అమర్‌నాథ్‌రెడ్డి హైదరాబాద్ నుంచి గుమ్మలకుంటకు కారులో పయనమ య్యారు. వీరి వెంట కదిరికి వెళ్తున్న అక్షయ్‌కుమార్ అనే వ్యక్తి కూడా ఉన్నారు. మార్గమధ్యంలో వెల్దుర్తి మండలం మంగంపల్లె స్టేజ్ దాటిన తరువాత జాతీయరహదారి-44పై కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోయి కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ అవతలి రోడ్డులో పడింది. కారులో ప్రయాణిస్తున్న మహేశ్వరి(33) అక్కడికక్కడే మృతి చెందారు. అమర్‌నాథ్‌రెడ్డి, అక్షయ్ కుమార్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేశ్వరి భర్త పవన్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడు..


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువు

దేవనకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మేనమామ పొలంలో ఉల్లి పంట కోయడంతో ట్రాక్టరు ద్వారా పంట తరలించే క్రమంలో ట్రాక్టరు తిరగబడి డ్రైవర్ బోదెపాడు జగదీష్ (23) మృతి చెందిన ఘటన మండలంలోని కప్పట్రాళ్లలో శనివారం సాయంత్రం చోటు చేసుకొంది. వివరాలివీ.. గోనెగండ్ల మండలం బోదెపాడుకి చెందిన హనుమంతు, రంగులమ్మ దంపతుల రెండో కుమారుడు జగదీష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. కప్పట్రాళ్లకు చెందిన మేనమామ కోతి లక్ష్మన్న పొలంలో ఉల్లి పంట కోతకోసి, ట్రాక్టర్ ద్వారా లారీలోకి పంటను లోడ్ చేసేందుకు వెళ్తున్న తరుణంలో మలుపు తిరుగుతుండగా ట్రాక్టరు తిరగబడింది. ట్రాక్టర్ ఇంజన్ జగదీష్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జగదీష్‌కు భార్య, ఏడాది కుమారుడు ఉన్నారు.

క్షణాల్లో వెంటాడిన మృత్యువు

- పెళ్లిలో డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో యువకుడి మృతి


కొర్వి వీరేష్ (ఫైల్)

కోసిగి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గుండెలు అకస్మాత్తుగా ఆగిపోతున్నాయి. నడుస్తూ.. డ్యాన్స్ చేస్తూ.. జిమ్ చేస్తూ కుప్పకూలి మృత్యుఒడికి చేరుతున్నారు. 28 ఏళ్ల యువకుడు పెళ్లి వేడుకల్లో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి కోసిగిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... కోసిగిలోని 9వ వార్డు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న కొర్వి వీరేష్ (28) ఆదోని మండలం కుప్పగల్లులో బంధువుల పెళ్లి ఊరేగింపులో డ్యాన్స్ చేస్తుండగా.. గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. బంధువులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. అప్పటి వరకు పెళ్లి వేడుకల్లో సరదాగా అందరితో డ్యాన్స్ చేస్తూ పాల్గొన్న వీరేష్ కుప్పకూలిపోయి గుండెపోటుకు గురి కావంతో పెళ్లింట విషాదచాయలు అలుముకున్నాయి. 20 నిమిషాల వ్యవధిలోనే జరగరాని నష్టం జరిగిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడికి భార్య సరోజ, ఆరేళ్ల కుమారుడు విజయదుర్గ, మూడేళ్ల కుమార్తె అమ్ములు ఉన్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడికి జైలు శిక్ష

చాగలమర్రి/రుద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం రేంజ్‌లో ఎర్రచందనం రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులకు తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు శనివారం రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. ఆళ్లగడ్డ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన తీర్పునే తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టు తిరిగి అమలు చేసిందని అన్నారు. రుద్రవరం రేంజ్‌లోని డీ వనిపెంట సెక్షన్ పెద్దవంగళి బీట్‌లో రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన గగ్గర వెంకట రమణ, ఉత్తనాల నరసింహులు, అక్కెం మద్దిలేటి, హుసేన్‌వలిలు పట్టుబడిన విషయం విదితమే. వీరికి తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టు వెయ్యి రూపాయలు, ఏడాది జైలు శిక్ష విధించింది. నిందితులను చిత్తూరు జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.


చాగలమర్రి: నిందితులతో అటవీ సిబ్బంది


ఒప్పంద ఉద్యోగిపై చర్యలు

శ్రీశైలం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఇంజనీరింగ్ భాగంలో ఏఈఈగా పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగి వి. రాజేశ్వరరావును విధుల నుంచి తొలగించినట్లు ఈవో ఏం. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శ్రీశైల దేవస్థానం పరిధిలో శుక్రవారం రాత్రి స్థానిక వైసీపీ నాయకుడు ఎంఏ రజాక్‌తో కలిసి ఒప్పంద ఏఈఈ వి. రాజేశ్వరరావు (రాజేష్) మద్యం తాగుతుండగా స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ఈ విషయం దేవస్థానం దృష్టికి రావడంతో ఏఈఈని విధుల నుంచి తొలగించారు. దేవదాయ చట్టం 30/1987 అనుసరించి మద్యం తాగిన విషయంపై దర్యాప్తు జరిపి ఇద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఐదెకరాలు ఆక్రమణ

- చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం స్థలాలపై వైసీపీకి చెందిన ఓ కుటుంబం కన్ను
- రూ.కోట్లు విలువ చేసే భూములను సాగుకు అనుకూలంగా మార్చుకున్న వైనం
- నిలిచిపోయిన చేపల ఉత్పత్తి ● శిథిలావస్థలో తొట్లు


మామిడిచెట్లు తొలగించి సాగుకు యోగ్యంగా చేసిన భూములు


శిథిల భవనంలో చేప పిల్లలను ఉత్పత్తిచేసే యంత్రాలు


శిథిలావస్థలో చేప పిల్లలను పెంచే నీటితొట్లు


మత్స్యశాఖ భూముల్లో వృక్షాలు నరికివేసిన దృశ్యం

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగడంచ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం పరిధిలోని భూములు ఆక్రమణకు గురయ్యాయి. వైసీపీ హయాంలో ఆ పార్టీకి చెందిన ఓ కుటుంబం భూములను ఐదెకరాలు ఆక్రమించుకుని మామిడి మొక్కలు నాటి పెంచినట్లు తెలుస్తోంది. అయితే వైసీపీ ప్రభుత్వం స్థానంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విషయం బయటపడింది. గుట్టుచప్పుడు కాకుండా మామిటిచెట్లను తొలగించి ఆనవాళ్లు లేకుండా భూములను చదును చేశారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్యకు సమాచారం తెలిసింది. దీంతో ఆ భూములను కాపాడాలని ఎమ్మెల్యే రెండు నెలల క్రితం మత్స్యశాఖ ఉన్నతాధికారులకు చెప్పారు. రూ.కోట్లవిలువైన భూములను ఆక్రమించిన వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు ఇప్పటి దాకా స్పందించలేదని పలువురు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక భూముల ఆక్రమణ గురించి కొందరు టీడీపీ నాయకులు బయటపెట్టారు. అయితే అధికారులు సంబంధింత వ్యక్తులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడుతారా? లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

తంగడంచ రాష్ట్ర విత్తనోత్పత్తి క్షేత్రం మొత్తం 1653 ఎకరాల్లో భాగంగా అందులో ఉద్యానవనానికి 26 ఎకరాలు, చేపల ఉత్పత్తి కేంద్రానికి 10 ఎకరాలు అప్పట్లో కేటాయించారు. ప్రస్తుతం ఉద్యానవనశాఖకు కేటాయించిన భూముల్లో జగనన్న కాలనీకి కొంతభూమిని కేటాయిం చారు. మిగతా భూముల్లో ప్రస్తుతం మూడు ఎకరాల్లో సపోటా చెట్లు ఉన్నాయి. మిగతా భూమి నిరుపయోగంగా మారింది. చేపల ఉత్పత్తి కేంద్రంతోపాటు బోరు, సిబ్బంది ఉండటానికి క్వాటర్స్, చేపలు పెంచడానికి ఒక ఎకరా విస్తీర్ణంలో బెడ్లు నిర్మించి 1990 నుంచి 2000 సంవత్సరం వరకు చేపలు ఉత్పత్తి జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన చేపపిల్లలను మత్స్యకారులు వివిధ ప్రాంతాలకు తీసుకుని వెళ్లి చెరువుల్లో పెంచుకునేవారు. ఎవరైనా చెరువుల్లో, కుంటల్లో చేపలు పెంచుకునే రైతులు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని చేప పిల్లలు ఉత్పత్తి చేసే వారివద్ద వ్యయప్రయాసాలతో ఎక్కువ ఖర్చు పెట్టి తెచ్చుకుని పెంచుకుంటున్నారు.

హద్దులు చూపాలని లేఖ రాశాం

ఆక్రమణకు గురైన విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే తమ భూములకు హద్దులు చూపాలని జూపాడుబంగ్లా తహసీల్దార్ రాతపూర్వకంగా లెటర్ ఇచ్చాం. ఎమ్మెల్యే జయసూర్య కూడా మా దృష్టికి తీసుకొచ్చారు. భూములను రెవెన్యూ అధికారులు చూపిస్తే అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- రాఘవరెడ్డి, జేడీ, మత్స్యశాఖ

మా దృష్టికి రాలేదు



మత్స్యశాఖ అధికారులు ఎటువంటి లెటర్ ఇవ్వలేదు. ఆధారాలు ఏమైనా ఉంటే ఆ ప్రకారం సర్వేయర్లను పంపించి సర్వే చేయించి భూముల హద్దులను ఏర్పాటు చేసి అప్పగిస్తాం. ఇంతవరకు మత్స్యశాఖ అధికారులు రాలేదు.

- చంద్రశేఖర్‌నాయక్, తహసీల్దార్, జూపాడుబంగ్లా

అక్రమార్కులను వదిలే ప్రసక్తే లేదు



వైసీపీ హయాంలో వైసీపీకి చెందిన వారు రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. అధికారులు పట్టించుకోక పోవడంపై దారుణం. అక్రమార్కులను వదిలే ప్రసక్తే లేదు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పా.

- గిత్తా జయసూర్య, నందికొట్కూరు ఎమ్మెల్యే

రాష్ట్రంలో ప్రజా పాలన: మంత్రి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. నంద్యాల నియోజకవర్గంలోని నలుమూలల నుంచి వచ్చిన పలువురి నుంచి మంత్రి వినతులు స్వీకరించారు. ముఖ్యమైన వినతులపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు వేదిక మీద నుంచే ఫోన్‌లో ఆదేశాలిచ్చారు. తనకు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సహకరిస్తే నంద్యాల పట్టణాన్ని కేవలం 6 నెలలలో పరిశుభ్రంగా తయారు చేస్తానని బాబు అనే వ్యక్తి మంత్రికి వినతి పత్రం ఇచ్చా రు. కమిషర్‌కు చెబుతానని మంత్రి హామీ ఇచ్చారు. నాయ కులు మునగాల విశ్వనాథరెడ్డి, పుసులూరు మాజీ సర్పంచ్ పుల్లయ్య పాల్గొన్నారు.

'అర్హులకు రుణాలు ఇవ్వండి'

నంద్యాల కల్చరల్/మున్సిపాలిటీ: అర్హులైన బీసీలందరికీ రుణాలు ఇవ్వాలని న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుసేన్‌ను ఆదేశించారు. ఈడీ శనివారం మంత్రిని నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా పంపిణీ కానున్న రుణాల గురించి ఈడీ మంత్రికి వివరించారు.

'వైసీపీ పాలనలో నష్టపోయిన విద్యార్థులు'

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల వేలాదిమంది బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉచిత చదువు అవకాశాన్ని కోల్పోయారని ఉచిత విద్యా తల్లిదండ్రుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. సంఘం ప్రతినిధులు శనివారం మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ వైసీపి ప్రభుత్వం విద్యాహక్కు చట్టం 2009ని ఏ మాత్రం పట్టించుకోకుండా అడ్డగోలుగా అస్పష్టంగా జీవో నెంబర్ 24/2023 ను విడుదల చేసి 25 శాతం ఉచిత పథకాని తూట్లు పొడి వేలాది మంది పేద విద్యార్థులకు అన్యాయం చేసిందని వాపోయారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే


అల్లూరులో వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరష్కరించ డానికి చర్యలు తీసుకుంటామని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు మండలం లోని అల్లూరు గ్రామంలో పబ్లిక్ గ్రీవెన్స్ (ప్రజా సమస్యల పరిష్కారివేదిక) కార్యక్రమం పనిర్వహించారు. ఈ పబ్లిక్ గ్రీవెన్స్‌లో లో ప్రజలు వారికి వున్న వివిధ సమస్యల గురించిన వినతి పత్రాలను ఎమ్మెల్యే జయసూర్యకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రైతులకు వున్న భూ సమస్యలను, గ్రామాలలో మౌళిక వసతులగురించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య, విద్యుత్ బల్బులు, వైద్యం మొదలగు వాటిని గుర్తించి పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కారవేదికను ప్రతి మండలంలోను శనివారం రోజున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రజలు దీనిని పూర్తి సద్వినియోగ పరుచు కోవాలని సూచించారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు వేల బారికేడ్లు ఏర్పాట్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు 2 వేల బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు శ్రీశైలం సిఐ జి. ప్రసాదరావు తెలిపారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహరెడ్డి, డీఈ చంద్ర శేఖర శాస్త్రిలతో కలసి ముఖద్వారం, హటకేశ్వరం, సాక్షి గణపతి, దాసరి అన్నదాన సత్రం, ఆర్టీసి బస్ స్టాండ్, హెలిప్యాడ్ మరియు ఔటర్ రింగు రోడ్డులో 2 వేల శాశ్వత సిమెంట్ బారికేడ్లను ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

సీమలో వర్షాభావ పరిస్థితులపై కవితాగానం


రచయిత ప్రసాద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన రచయిత కొప్పుల ప్రసాద్ రాయలసీమలోని వర్షాభావ పరిస్థితులపై 'సీమ వాన సవ్వడి' అనే శీర్షికతో కవితా గానం చేశారు. వైయస్సార్ జిల్లా రచయితల మహాసభలు శనివారం కడపలోని ఐఎంఏ హాలులో వేయ్యేళ్ల తెలుగు సాహిత్యం - రాయలసీమ భాగస్వామ్యం అనే అంశపై వైభవంగా సభ నిర్వహించారు. " సీమ వాన సవ్వడి " అనే కవితా శీర్షిక అక్కడి రచయితలు, నిర్వాహకులను ఆకట్టుకుంది. అనంతరం కడప జిల్లా రచయతల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నంద్యాల రచయయతలు, సాహితీ ప్రతినిధులు సాహితీ మిత్రులు అంతర్జాతీయ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాద్, డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ ఉదయ శంకర్, డా.సహదేవుడు, అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర వివిధ కళాశాల యాజమానులు, ఉపాధ్యాయులు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

12న బోనాల మహోత్సవం

ఆత్మకూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు శివార్లలోని జంబులాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఈనెల 12న బుధవారం మాఘశుద్ధ పౌర్ణమి (భారతాల పౌర్ణమి) వేడుకను పురస్కరించు కుని బోనాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. లోకకళ్యాణార్థం ప్రతిఏటా మాఘశుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారికి మహిళలచే బోనాలను ఆనవాయితీగా సమర్పిస్తారు. ఈ వేడుకలో భాగంగానే అమ్మవారికి విశేష అలంకరణ గావించి వేదపండితుల ఆధ్వర్యంలో యాగక్రతువులను అభిషేకాలు, కుంకు మార్చనలు వంటి పూజా క్రతువులను శాస్త్రోక్తంగా జరపనున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

డాబాపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

- ఆహార నాణ్యత లోపంపై ఓ న్యాయాధికారి సీరియస్?


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

మహానంది, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గాజులపల్లిలోని ఒక డాబాపై నంద్యాల ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, ఖాసీం వలి శనివారం దాడులు నిర్వహించారు. ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌కు తరలించామని వారు చెప్పారు. వివరాలివీ.. అనంతపురం జిల్లాకు చెందిన ఓ న్యాయాధికారి శనివారం మధ్యాహ్నం భోజనానికి ఓ డాబా వద్ద ఆగినట్లు సమాచారం. ఆహార నాణ్యత లోపంపై న్యాయాధికారి ప్రశ్నించగా డాబా యజమానులు దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. ఈ విషయాన్ని న్యాయాధికారి ఎస్పీ దృష్టికి, ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసినట్లు తెలిసింది. వీరి వెంట ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

'ఆరోపణలు అవాస్తవం'

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓ స్థలం విషయంలో రాజకీయ నాయకుల అండదండలతో సేవా ముసుగులో కబ్జాలకు పాల్పడుతున్నాడని, బెదిరింపులకు గురిచేస్తున్నాడని కత్తి శ్రావణిరెడ్డి అనే మహిళ చేసిన ఆరోపణలు అవాస్తవమని ప్రముఖ ఈఎన్టీ డాక్టర్ మధుసూదన్‌రావు ఖండించారు. శనివారం డా.మధుసూదనరావు, ఆయన కుమారుడు డా.మణిదీప్ ప్రెస్‌మీట్ పెట్టారు. వారు మాట్లాడుతూ రైతునగరం గ్రామంలోని ఓ స్థలానికి సంబంధించి తనపై చేసిన ఆరోపణలు సరికాదన్నారు. స్థల వివాదం కోర్టు పరిధిలో ఉందని, ఇప్పటికే జిల్లా కోర్టు డిక్రీ ఇచ్చిందని, ఏవైనా ఆధారాలు ఉంటే కోర్టుకు సమర్పించవచ్చని చెప్పారు. కోర్టు తీర్పును తాను శిరసా వహిస్తానని పేర్కొన్నారు. సదరు స్థలానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు పరిశీలించి 2008లో 4ఎకరాల 2సెంట్లు కొన్నామని తెలిపారు.

బీజేపీ సంబరాలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద కార్యకర్తలు శనివారం టపాసులు, స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు కృష్ణమూర్తి, నంద్యాల టౌన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రసన్న, చంద్రశేఖర్, బాలముని, స్వామిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాములపాడు: ఢిల్లీలో బీజేపీ గెలవడంతో పాములపాడులో బీజేపీ మండల అధ్యక్షుడు మురళీమోహన్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకొన్నారు. నాయకులు రామకృష్ణ, హేమచంద్ర, విజయభాస్కర్, చంద్రారెడ్డి, గోపాలకృష్ణయ్య, ఆవులయ్య, రమేశ్ పాల్గొన్నారు.

'శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కొత్తపల్లి ఎస్ఐ కేశవ ప్రజలకు సూచించారు. శనివారం రాత్రి మండల కేంద్రమైన కొత్తపల్లి బస్టాండు సెంటరులో ఎస్ఐ కేశవ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

- నెంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే అటువంటి వాహన దారుల వాహనాలు సీజ్ చేస్తామని కొత్తపల్లి ఎస్ఐ కేశవ హెచ్చరించారు. శనివారం సాయంత్రం మండలంలోని దుద్యాల గ్రామ శివారులో ఎస్ఐ కేశవ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా హెల్మెట్ లేకుండా, ట్రాఫిక్ రూల్స్ పాటించని 12 మంది ద్విచక్ర వాహనదారులకు జరిమనా విధించి రూ.1620 జరిమానా విధించారు.

హోరాహోరీగా ఎద్దుల పోటీలు

మిడుతూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రోళ్లపాడు అభయ అరణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గత రెండు రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం నాలుగు పళ్ల వరుస గల బండలాగుడు ఎద్దుల బల ప్రదర్శనలు ఉత్సాహంగా జరిగాయి. ఈ బల ప్రదర్శనలో 8 జతల ఎద్దులు పాల్గోన్నాయి. హోరాహోరీగా జరిగిన బల ప్రదర్శనలో మొదటి బహుమతి కంచుపాడు గ్రామానికి చెందిన అంజి రెడ్డి రూ.40 వేలు, రెండో బహుమతి దాసరపలి గ్రామ ప్రతాప్ రూ.30 వేలు, మూడో బహుమతి అప్పన పల్లె గ్రామ గురుచరణ్ రూ.20 వేలు, నాలుగో బహుమతి దాసర పల్లె గ్రామం దేవరాజు నాయుడు రూ.10 వేలు, ఐదో బహుమతి దొర్నిపాడు గ్రామానికి చెందిన మనోహర్ యాదవ్ రూ. ఆరు వేలు, ఆరో బహుమతి బ్రాహ్మణ పల్లె గ్రామం జయమ్మ రూ.5 వేలు దక్కించుకున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టరు విడుదల


పోస్టరును ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి, వేదపండితులు

మహానంది, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ ప్రాంగణంలోని కల్యాణమంటపంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టరును ఆలయ వేదపండితులు ఈవో శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. అంతకు ముందు పోస్టరుకు వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 24 నుండి మార్చి 1 వ తేది వరకు మహానందిలో మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈవో చెప్పారు. ఏఈవో ఎర్రమల్ల మధు,పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు యాదవ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు(చిన్నా), ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు జనార్దన్ శర్మ, రాజమాణిక్యశర్మ, శంకరయ్యశర్మ, మణికంఠశర్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

పాములపాడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన కౌలు రైతు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. పాములపాడు గ్రామానికి చెందిన కౌలు రైతు గొల్ల శివప్రసాద్ (45) ఐదేళ్లుగా జూటూరు గ్రామంలో 12 ఎకరాలు పొలాన్ని కౌలుకు తీసుకొని మొక్కజొన్న, మిరప, తదితర పంటలను సాగు చేశాడు. ఏటా నష్టాలు వస్తుండటంతో దాదాపు రూ.25 లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చలేక మనస్తాపం చెంది గతనెల 9న పురుగుమందు తాగాడు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శనగ పంటకు నిప్పు


కాలిపోతున్న శనగ పంట

మిడుతూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసుల బాట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు పప్పు శనగ పంటకు నిప్పు పెట్టడంతో నాలుగు ఎకరాల పంట పూర్తిగా కాలిపోయింది. వివరాలివీ.. మిడుతూరు గ్రామానికి చెందిన సంజీవ కుమార్ అనే రైతు రెండు ఎకరాల్లో, సుజ్ఞానం అనే రైతు రెండు ఎకరాల్లో పప్పు శనగ సాగు చేశారు. పంట చేతికి రావడంతో నూర్పిడి కోసం ఇద్దరు రైతులు కుప్పగా వేశారు. అయితే శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శనగ పంట కుప్పలకు నిప్పు పెట్టారు. రైతులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల నూనెపల్లె మున్సిపల్ పాఠశాలలో 2001వ సంవత్సర బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత పాఠశాలలో ఒకే వేదికపై కలవడంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తూ గతాన్ని విద్యార్థి దశను గుర్తు చేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. హెచ్ఎం చలపతిరావు, పూర్వవిద్యార్థులు సుధాకర్, రంజిత్, సురేష్, నాగరాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పోలీసు స్పోర్ట్స్ మీట్'


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

నంద్యాల క్రైం/హాస్పిటల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని నంది బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం డివిజనల్ లెవెల్ పోలీస్ ఆఫీసర్స్, పోలీస్‌మెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు అడిషనల్ ఎస్పీ చంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాకారుల్లో ఉత్సాహం నింపి క్రీడల విజయవంతానికి ఎస్పీ కృషి చేశారు. పోటీల్లో ఆఫీసర్స్ టీమ్‌లో ఆరుగురు పాల్గొనగా, పోలీస్‌మెన్ 10టీమ్‌లు పాలొ న్నాయి. పోటీల్లో వివిధ డిపార్ట్‌మెంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, మోహన్‌రెడ్డి, ఇంతియాజ్, ఈశ్వరయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్లు నాగార్జునరెడ్డి, సుబ్బయ్య, సవిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు, ఫిజికల్ డైరెక్టర్లు నాగరాజు, గోపి, నాయకులు భరత్‌రెడ్డి, ఓబులేసు, మాబుబాషా, నంది అకాడమీ కోచ్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కల్పనకు కృషి'

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు వృత్తి విద్యాకోర్సుల ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆరోగ్యమాత చర్చి పీఠాధిపతులు డాక్టర్ గోరంట్ల జ్ఞానేష్ తెలిపారు. మైత్రాసన యువత డైరెక్టర్ ఫాదర్ రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన యువత సదస్సులో డాక్టర్ జ్ఞానేష్ ముఖ్యఅతిథిగా హాజరై సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత జీవన స్థితిగతులను తెలుసుకునేందుకు సదస్సును నిర్వహించామన్నారు. కేడీఎస్ఎస్, డాన్‌బోస్కో, గృహిణి చైతన్య సెంటర్‌ల ద్వారా వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫాదర్‌లు మర్రెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీ సంకల్ప్ పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న స్పెక్టాకులర్ స్పోర్ట్స్ కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల అధినేత సుధాకర్, రమ్యారెడ్డి హాజరయ్యారు. ముందుగా సంకల్ప్ లోగో చిహ్నం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజేతలకు బహుమతులను పాఠశాల యాజమాన్యం అందజేసింది. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు, నంద్యాల ఎస్‌డీపీవో ఎం.జావళి అల్ఫోన్స్ మార్గదర్శకత్వంలో రోడ్డు భద్రత నియమాలపై భారీ వాహనాల డ్రైవర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్త తెలిపారు. అవగాహన సదస్సు స్థానిక విజయ డెయిరీ ఎదురుగా గల లారీ అసోసియేషన్ ఆఫీస్‌నందు నిర్వహించారు.

ఘనంగా 'యూత్ ఎక్సేంజ్' ప్రోగ్రాం

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాలలో జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ యూత్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్‌ను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం అధికారి రాహుల్ గిరిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని శ్రీ రామకృష్ణా విద్యాసంస్థల ఎస్టేట్ మేనేజర్ ప్రగతిరెడ్డి, ఏబీవీపీ నాయకులు పార్థసారధిరెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు గడివేముల మండలంలోని సోలార్ ప్లాంట్, జిందాల్ ఫ్యాక్టరీని సందర్శించారు.

'అడవులను కాపాడుకోవాలి'

పాణ్యం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అడవులను కాపాడుకోవడం మన బాధ్యత అని పాణ్యం రేంజ్ అటవీ శాఖ అధికారి సుబ్బరాయుడు అన్నారు. శనివారం అటవీ సంరక్షణపై పాణ్యం సెక్షన్ పరిధిలోని రామతీర్థం, నందివర్గం గ్రామాలలో కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, ఎఫ్‌బీవో వెంకటరెడ్డి, ఫారెస్టు రెస్క్యూ టీం సభ్యులు, ప్రతాప్ కళాజాత బృందం సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'జయప్రదం చేయండి'

పాణ్యం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండల సమస్యలపై ఈనెల 11, 12 తేదీలలో చేపట్టిన నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు అరుణ్ కుమార్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో విద్య, వైద్య, వ్యవసాయ తదితర సమస్యలు ఉన్నాయన్నారు. సమాజ్‌వాది పార్టీ నాయకులు శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

టీడీపీతోనే బీసీల సంక్షేమం


మాట్లాడుతున్న బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ తెలిపారు. శనివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్, పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరటనిచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. బ్యాంకుల ద్వార రుణ సాయం చేసేందుకు ప్రోత్సాహం ఇస్తుందని అన్నారు. చట్టసభల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, లాలయ్య, చిన్నికృష్ణయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్

చాగలమర్రి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని 15, 16 తేదీల్లో గ్రేటర్ రాయలసీమ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. రాజపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.15,016, రెండో బహుమతి రూ.12,016, మూడో బహుమతి రూ.10,016, నాలుగో బహుమతి రూ.8,016 అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 9000659990, 9581899813లను సంప్రదించాలని కోరారు.

పశుగణన 90 శాతం పూర్తి

చాగలమర్రి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో 90 శాతం పశుగణన పూర్తయినట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శనివారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశుగణన సర్వే నిర్వహించినట్లు తెలిపారు. పశుగ్రాసం పెంపకం కింద 24 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పశు ఆరోగ్య శిబిరాలను 26 గ్రామాల్లో నిర్వహించామని అన్నారు. గొంతువాపు, జబ్బవాపు వ్యాధుల నివారణకు గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేశామని అన్నారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకా, డివార్మింగ్ చేశామని అన్నారు. పశువుల వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దేశ నాయకులను స్మరించుకోవాలి


జాకీర్ హుసేన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అమీర్ బాషా, విద్యార్థులు

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : దేశ నాయకులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ప్రైవేట్ పాఠశాలల ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. పట్టణంలోని ఇండియన్ గ్లోబల్ హైస్కూల్‌లో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ జాకీర్ హుసేన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శనివారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ దస్తగిరి బాషా, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు


బండలాగుతున్న ఎద్దులు

డోన్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిద్దెపల్లి గ్రామంలో జరిగిన మిన్నెల్ల, మౌలాలి, కాశీం స్వాముల ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అంతరాష్ట్ర బండలాగుడు పోటీలు శనివారం హోరాహోరీగా జరిగాయి. మిద్దెపల్లి గ్రామానికి చెందిన తాత వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 12 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో తాడిపత్రికి చెందిన రాజశేఖర్ బ్రదర్స్ వృషభాలు మొదటి విజేతగా నిలిచాయి. వృషభాల యజమానులకు రూ.తలారీ వెంకటస్వామి కుమారులు చేతులమీదుగా రూ.40వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంగారు జయచంద్ర, ఎంపీటీసీ ఎర్రిస్వామి, మాజీ ఎంపీటీసీ దేవరబండ వెంకటనారాయణగౌడు, ఎద్దుపెంట మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యల్లావత్తులలో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో బీపీ చూస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ శాంతి

రుద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో 104 ఆధ్వర్యంలో శనివారం సంచార చికిత్స వైద్యశిబిరం నిర్వహించారు. అయితే వైద్యులు, ఏఎన్ హాజరు కాలేదు. సూపర్‌వైజరు మధ్యాహ్నానికే వెళ్లిపోవడంతో ప్రజలు ఇదేమి వైద్య శిబిరమని ప్రశ్నిస్తున్నారు. శిబిరం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహించాలి. అయితే మధ్యాహ్నానికే శిబిరాన్ని ముగించేశారు. సుమారు 80 నుంచి వంద మంది రోగులు శిబిరానికి వచ్చారు. ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఆశావర్కర్లు వచ్చిన వారికి బీపీ చెక్ చేసి మందులు పంపిణీ చేశారు.

సర్వాయిపల్లెకు చేరుకున్న పార్వేట పల్లకి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అహోబిళ లక్ష్మీనరసింహస్వామి పార్వేట పల్లకి శనివారం సర్వాయిపల్లె గ్రామం చేరుకుంది. ఉత్సవమూర్తులకు గ్రామ సర్పంచ్ ఉమాదేవి, గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారికి రెవెన్యూ అధికారులు, పోలీసులు మొదటి పూజ చేశారు.
శిరివెళ్ల : నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన సర్వలక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. నారసింహుడి మూలవిరాట్‌కు అర్చకులు వేకువజామునే అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు రంగనాయకులు స్వామి, పవన్ కుమార్‌శర్మ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

డోన్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన డోన్ మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డోన్ పట్టణం సుందర్‌సింగ్ కాలనీకి చెందిన ఖాజాబాషా (32) కొత్తపల్లి గ్రామ సమీపంలో రేకుల షెడ్డు నిర్మాణ పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా.. రేకుల షెడ్డు పైభాగంలోని విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగిలి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి తెలిపారు.

వంతెనలు అంతేనా..?

● శిథిలావస్థలో వంతెనలు ● మరమ్మతులు చేపట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు


అల్లూరు గ్రామ సమీపంలో దెబ్బతిన్న పాలేరు వాగు వంతెన

వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాటిపై ప్రయాణించాలంటే జనాలు భయపడిపోతున్నారు. ఎప్పుడో ఏళ్ల క్రితం వంతెలను నిర్మించడంతో అవి శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వాలు వాటికి మరమ్మతులు కూడా చేయించడం లేదు.

చాగలమర్రి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామ సమీపంలోని వక్కిలేరుపై బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన 11 కమాండ్ల వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనకు ఇరువైపులా వక్కిలేరు నీరు ప్రవహించేందుకు వంతెన ఏర్పాటు చేశారు. మరో పక్క కేసీ ప్రధాన కాలువ నీరు పోయేందుకు లైనింగ్ పనులతో కాలువను ఏర్పాటు చేశారు. వక్కిలేరుపై రాకపోకలు చేసేందుకు స్లాబ్, రక్షణ గోడలు ఏర్పాటు చేశారు. రైతులు, కూలీలు, వాహనదారులు ఈ వంతెనపైనే రాత్రింబవళ్లు రాకపోకలు చేయాల్సి ఉంది.

వంతెనపై ఉన్న పైకప్పు, రక్షణ గోడలు దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రక్షణ గోడ పైకప్పు మరమ్మతు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన వంతెన

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండ సమీపంలో ఎస్సార్బీసీ కాల్వ వద్ద నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. ఈవంతెన వద్ద గతంలో అనేక ప్రమాదాలు సంభవించారు. ముఖ్యంగా పొలం ఉన్న వ్యవసాయదారులు తమ పంట పొలాలు సాగు చేయడానికి ఈ వంతెన మీదుగా వెళ్లాలి.. ఈ వంతెన వద్ద ఇరువైపులా ఉన్న ర్యాంపులు ప్రమాదాలకు విరిగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ వంతెనను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అలాగే ఈవంతెన మీదుగా రవ్వలకొండలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిని, ఆయన కాలజ్ఞానం రచించిన గవిని దర్శించుకోవడానికి నిత్యం కర్నాటక, ఏపి, తెలంగాణా రాష్ట్రాలనుంచి నిత్యం వాహనాలు వస్తుంటాయి. అధికారులు ఈ వంతెనకునిధులు మంజూరు చేయించి ప్రమాదాలు సంభవించకుండా వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో వంతెనలు


ఉయ్యావాడ: మండలంలోని ఆయా వాగులు, వంకలపై ఉన్న వంతెనలు శిస్థిలావస్థకు చేరుకున్నారు. వంతెనపై రంధ్రాలు, సిలింగ్, సైడ్ గోడలు పడిపోయి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆరు వంతెనలు ఉన్నాయి. ఆర్.పాంపల్లె, పెద్దయ్మనూరు గ్రామాల సమీపంలో ఉన్న కుందరవాగు వంతెనలు వినహ మిగిలిన నాలుగు వంతెనలు శిస్థిలావస్థలో ఉన్నాయి.

మండలంలోని ఇంజేడు గ్రామ సమీపంలో కుందవాగుపై దాదాపుగా 70 ఏళ్ల క్రితం వంతెనను నిర్మించారు. ఈ వంతెన ప్రస్తుతం శిస్థలావస్థలో ఉంది. అల్లూరు గ్రామ సమీపంలో కోవెలకుంట్ల-జమ్మలమడుగు జాతీయ రహదారిలో పాలేరు వాగుపై దాదాపుగా వందేళ్ల క్రితం బ్రిటీష్ వారి కాలంలో వంతెనను నిర్మించారు. ప్రస్తుతం ఆ వంతెన పరిస్థితి దారుణంగా ఉంది. రూపనగుడి, బోడెమ్మనూరు గ్రామాల సమీపాల్లో ఉన్న కుందూనదిపై దాదాపుగా 80 ఏళ్ల క్రితం వంతెనలను నిర్మించారు. ఈ వంతెనల అడుగు భాగం బాగానే ఉన్నా అక్కడక్కడా పిల్లర్ల వద్ద సీలింగ్ దెబ్బ తిని కడ్డీలు బయట పడ్డాయి.


చాగలమర్రిలో వక్కిలేరు వంతెనపై దెబ్బతిన్న సైడ్‌వాల్


వక్కిలేరు వంతెనపై బీటలు వారిన స్లాబ్


బనగానపల్లె: ప్రమాదకరంగా ఎస్సార్బీసీ కాల్వ వంతెన


ఇంజేడు గ్రామ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న కుందరవాగు బ్రిడ్జి


బ్రిడ్జి అడుగు భాగంలో దెబ్బతిన్న సీలింగ్


కుందరవాగు బ్రిడ్జి చివరి భాగంలో పగుళ్ల ఇచ్చిన ఓ వైపు గోడ

అరాచకాలకు చిరునామా వైసీపీ: ఎమ్మెల్యే



ఆళ్లగడ్డ (శిరివెళ్ల), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచక పాలనకు వైసీపీ చిరునామ అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో శనివారం ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ అభివృద్ధిని పక్కన పెట్టి అరాచక పాలన సాగించిందని అన్నారు. నేడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఎమ్మెల్యేలు అరాచకాలు చేస్తున్నారని వైసీపీ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 2.0 అంటూ ఏదో చేస్తానని ఊగిపోతున్నాడని అన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీకి వచ్చి మాట్లాడలేని దుస్థితిలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. తప్పుడు కేసులు, అవినీతి కార్యక్రమాలు, దౌర్జన్యాలు చేసిన వైసీపీ పాలన నుంచి విముక్తి పొందిన రాష్ట్రం నేడు అభివృద్ధి, సంక్షేమం బాటలో నడుస్తోందని అన్నారు.

బీజేపీ సంబరాలు


కోవెలకుంట్లలో స్వీట్లు తినిపిస్తున్న బీజేపీ నాయకులు


డోన్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో డోన్ నియోజకవర్గ బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డే మహారాజ్, జిల్లా నాయకులు ఆర్మీ రామయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. శనివారం పట్టణంలోని సమ్మెఖ్యాంద్రకట్ట వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి టైలర్‌నాగర్జున, కోడే అశోక్, దొరపల్లి శివశంకర్, విజయ్ యాదవ్, పోలా వెంకటేశ్వర్లు, ఆరబోలు వీరేష్, వీరనారాయణాచారారి, ఉమ్మాజీ నాయుడు పాల్గొన్నారు.

డోన్ రూరల్: ఢిల్లీలో బీజేపీ విజయం చారిత్రాత్మకమైనదని టీడీపీ యువ నాయకులు వై.హనుమంతరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని పలు స్థానాల్లో బీజేపీ విజయానికి కృషి చేశారన్నారు.

కోవెలకుంట: ఢిల్లీలో బీజేపీ అఖండ విజయం సాధించడంతో కోవెలకుంట్ల మండలంలో బీజేపీ అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు లింగన్న, లాయరు తిరుపతయ్య బీజేపీ రాష్ట్ర నాయకులు సీతారామయ్య, బాలావతి, రాజు, మల్లిఖార్జున తేజ సుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : అహోబిలంలో బెస్త, గంగపుత్ర నిత్య అన్నదాన సత్రంలో భీష్మ ఏకాదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు గొడుగు హరీష్ కుమార్ ఆధ్వర్యంలో భీష్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహాభారతంలోని భీష్ముడు జీవించిన విధానాన్ని ఆయన వివరించారు. అనంతరం అన్నదాన సత్రం నిర్మాణ పనులు మరింత వేగవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, లింగన్న, వెంగన్న, ఎల్లయ్య, నాగరాజు, నడిపెన్న, నాగేశ్వరరావు, వెంకటస్వామి, తిరుపాలు, వెంకటేశ్వర్లు, నరసింహులు పాల్గొన్నారు.
చాగలమర్రి: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి మాఘమాసం సందర్భంగా శనివారం వేద పండితులు ఉభయదారులు వనజారెడ్డి, వసంతకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రుక్మిణి కల్యాణం కన్నుల పండువలా సాగింది. శ్రీకృష్ణుడు, రుక్మిణి ఉత్సవమూర్తులచే కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులచే తాళిబొట్టు కట్టించి తలంబ్రాలు పోయించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గోవిందనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పులి చిన్న ఓబుళరెడ్డి, పద్మావతి, నడిపి ఓబుళరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, విజయ, వనిత, అరుణ, సుదర్శన్‌రెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.
డోన్ రూరల్: డోన్ మండలం కోట్లవారిపల్లె గ్రామ పరిధిలో ఉన్న గంగమ్మ గుడి వద్ద భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గంగపుత్రుల సంఘం గౌరవాధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున, అధ్యక్షులు కొచ్చెర్వు గోవిందు ఆధ్వర్యంలో భీష్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.
బేతంచెర్ల : భీష్మా ఏకాదశి పురస్కరించుకుని మండలంలో గంగపుత్రులు భీష్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం భీష్ముని జీవిత చరిత్రలను సమరసత ఫౌండేషన్ సభ్యులు నాగమోహన్ వివరించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్ష కార్యదర్శులు తెలుగు వెంకటరమణ, తెలుగు ఎల్లయ్య, మద్దలేటిల, గంగన్న, మద్దయ్య, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, రాముడు, రమణ, శ్రీనివాసులు, పరమేశ్వరుడు పాల్గొన్నారు.


అహోబిలంలో నివాళి అర్పిస్తున్న గంగపుత్రులు


మూడురాళ్లపల్లెలో రుక్మిణి కల్యాణం చేస్తున్న వేద పండితులు


కొట్లవారిపల్లెలో భీష్మ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న గంగపుత్రుల సంఘం నాయకులు,సభ్యులు


బేతంచెర్లలో భీష్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గంగపుత్రులు

పైప్‌లైన్ లీకేజీ



కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మీర్జాపురం గ్రామానికి సంబంధించిన తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో తాగు నీరు సరఫరా కావడంలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీర్జాపురం గ్రామానికి కొలిమిగుండ్ల సమీపంలో బోరు ఏర్పాటుచేసి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైప్‌లైన్ రెండు చోట్ల భారీగా లీకేజీ అవుతోంది. దీంతో నీరు మొత్తం మధ్యలోనే వృథాగా పోతోంది. అధికారులు స్పందించి లీకేజీకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బుగ్గన అర్జున్ రెడ్డి

ప్యాపిలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేద్దామని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పీఆర్‌పల్లి గ్రామంలో ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడారు. ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలో తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి పుల్లారెడద్ది, ప్రేమసాగర్ రెడ్డి, నరసింహారెడ్డి, శ్యాంరెడ్డి, కృష్ణమూర్తి, భువనేశ్వరరెడ్డి, రాము పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపాన ఉన్న కోట్ల స్టేడియంలో డా.అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింద ని, మార్చి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 6న పరీక్ష ఉంటుందన్నారు. మిగతా గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ


పేదల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్, ఫిబ్రవరి 08 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని శనివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మండల కార్యదర్శి బి.నారాయణ, పట్టణ కార్యదర్శి మోటరాముడు మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్‌కే రామ్మోహన్ పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.5.29 లక్షలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.5.29 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.5,29,815 ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆయన తెలిపారు.